ఆంధ్రజ్యోతి
***

ANDHRAJYOTHY
నల్లగొండ
5
మంగళవారం 23 ఏప్రిల్ 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.140	203	231
సూర్యాపేట	రూ.135	200	230
నల్లగొండ	రూ.140	204	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 41.5 । కనిష్ఠం 23.4

అకాల వర్షంతో ఆగమాగం



కొండాపురంలో నేలరాలిన మామిడి కాయలు

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం రాశులు
- తోటల్లో రాలిన మామిడి కాయలు, విరిగిన చెట్లు
- నష్టపోయిన రైతులు
- గుండాల, అడ్డగూడూరు, చిట్యాల, నార్కెట్‌పల్లి మండలాల్లో పిడుగుపాటు


అకాల వర్షం ఉమ్మడి జిల్లా అన్నదాతలను ఆగమాగం చేసింది. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి ఆరబోయగా, ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. పలుచోట్ల ధాన్యం వరదలో కొట్టుకుపోయింది. ఈదురు గాలులకు ధాన్యం రాశులపై కప్పిన పట్టాలు కొట్టుకుపోయి ఆ తరువాత కురిసిన వర్షానికి ధాన్యం తడిసింది. పలుచోట్ల మామిడి, నిమ్మతోటల్లో కాయలు నేలరాలాయి.



మోత్కూరు/అడ్డగూడూరు/ గుండాల, ఏప్రిల్ 22: మోత్కూరు మండలంలో ఆదివారం రాత్రి కురిసిన గాలివానకు రైతులు నష్టపోయారు. రాత్రి 9 గంటలకు ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. మండలంలో ఐకేపీ, సింగిల్ విండోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం, ఆరబెట్టి, ప్యాడీ క్లీనర్లతో శుభ్రం చేసి రాశులు పోసిన ధాన్యం తడిసింది. రాశులపై పట్టాలు కప్పినా ఈదురు గాలులకు లేచిపోయాయి. సీసీప్లాట్ ఫారం కావడంతో వరద రాశుల కింది నుంచి వెళ్లడంతో ధాన్యం కొట్టుకుపోయింది. ఈ 17 నుంచి ఆదివారం వరకు మోత్కూరు వ్యవసాయ మార్కెట్లో ధాన్యం కాంటాలు కాకపోవడంతో పెద్ద మొత్తంలో ధాన్యం పేరుకుపోయింది. సోమవారం సుమారు 1500 బస్తాలే కాంటా వేశారు. కొనుగోళ్లు మందగించడంతో వర్షానికి భారీ మొత్తంలో ధాన్యం బస్తాలు తడిచాయి. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి స్థలం లేక రైతులు అగచాట్లు పడ్డారు. ధాన్యాన్ని ఆరబెట్టకుంటే మొలక వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అడ్డగూడూరు మండలంలో భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో విద్యుత్ సరఫరా నిలిచింది. అడ్డగూడూరు, చౌళ్లరామారం, జానకీపురం, కంచనపల్లి, డి.రాపాక తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. రాపాక ఐకేపీ కేంద్రంలో వరదకు ధాన్యం కొట్టుకుపోయింది. మండలంలోని కంచనపల్లి గ్రామంలో పిడుగుపాటుకు భాషబోయిన లింగయ్య చెందిన గేదె మృతి చెందింది. గుండాల మండలంలో అకాల వర్షానికి గుండాల, సీతారాంపురం, వెల్మజాల, మాసాన్‌పల్లి, సుద్దాల, బ్రాహ్మణపల్లి తదితర గ్రామాల్లో ధాన్యం తడిసిపోయి కొట్టుకుపోయింది. పెద్దపడిశాల గ్రామంలో పిడుగుపాటుకు అవిరెండ్ల వెంకన్నకు చెందిన ఆవు మృతి చెందింది.

మామిడి తోటల్లో రాలిన కాయలు

ఈదురుగాలులకు మోత్కూరు, బుజిలాపురం, అనాజిపురం, కొండాపురం తదితర గ్రామాల్లో మామిడి తోటల్లో కాయలు రాలాయి. మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని కొండాపురం గ్రామ రైతులు కల్వల రాము, సోమన్నల ఐదెకరాల తోటలో మామిడి చెట్లు విరిగాయి. కాయ పూర్తిగా రాలి సుమారు రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బుజిలాపురంలో చింతల విజయభాస్కర్‌రెడ్డి, మడూరు యాదిరెడ్డి, అనాజిపురంలో కొల్లు శంకర్‌కు చెందిన తోటల్లో మామిడి కాయలు రాలాయి. పలు గ్రామాల్లో నిమ్మ తోటల్లో కాయలు రాలాయి. ఉద్యానశాఖ క్లస్టర్ అధికారి నసీమా సోమవారం బుజిలాపురం, కొండాపురం రైతుల మామిడి తోటలను పరిశీలించారు. గాలివానకు ఎనిమిది ఎల్‌టీ విద్యుత్ లైన్ స్తంభాలు, 11 కేవీ లైన్ విద్యుత్ స్తంభాలు నాలుగు విరిగాయని, పలు చోట్లు విద్యుత్ తీగలు తెగాయని విద్యుత్ ఏఈ హుస్సేన్ తెలిపారు. కొండాపురంలో మేకల షెడ్ కూలింది.



పెద్దపడిశాల గ్రామంలో పిడుగుపాటుకు మృతిచెందిన ఆవు

తడిసిన 10వేల బస్తాల ధాన్యం



సూర్యాపేట సిటీ: జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వ్యవసాయ మార్కెట్‌లో సుమారు 10 వేల బస్తాలకు పైగా ధాన్యం తడిసింది. ఆదివారం ఎగుమతి చేయకుండా మార్కెట్ ప్రాంగణంలో ధాన్యం బస్తాలు నిల్వ ఉండటంతో తక్కువ నష్టం వాటిల్లింది. శనివారం ఆలస్యంగా మార్కెట్‌కు ధాన్యం తీసుకువచ్చిన రైతులు, మార్కెట్ యార్డులలో అక్కడక్కడా రాశులు పోశారు. వర్షం వచ్చిన సమయంలో టార్పాలీన్లు కప్పని సుమారు 2వేల బస్తాల ధాన్యం తడసింది. తడిచిన ధాన్యాన్ని సైతం ఖరీదుదారులు సోమవారం కొనుగోలు చేయడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.



సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యం బస్తాలు, ధాన్యం

25 రోజులైనా ధాన్యం కొనుగోలు చేయలేదు



నేను ఆరు ఎకరాల్లో వరి సాగు చేశా. మార్కెట్లో ధాన్యం పోసి సుమారు 25 రోజులవుతోంది. ఆరబెట్టి, తూర్పార బట్టి శుభ్రం చేశా. క్వాలిటీ అధికారి పరిశీలించి 10 రోజులు గడిచింది. ఇప్పటి వరకు కాంటా వేయలేదు. రాత్రి వర్షానికి ధాన్యం రాశి చుట్టూ, అడుగున తడిసింది. తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్నా. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోళ్లు వేగవంతం చేయాలి.

- బీసు రాములమ్మ, మహిళా రైతు, మోత్కూరు

అమ్మనబోలులో రోడ్డెక్కిన రైతులు

నార్కట్‌పల్లి, చిట్యాలరూరల్: కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి వారాలు గడుస్తున్నా కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షానికి తడిసి ముద్దయింది. దీంతో ఆగ్రహించిన అన్నదాతలు రోడ్డెక్కి ఆందోళన చేశారు. ఈనెల 1న అమ్మనబోలులో నార్కట్‌పల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రోజుకు సగటున ఒక లారీ చొప్పున కేవలం 22 లారీల ధాన్యం మాత్రమే ఇప్పటి వరకు మిల్లులకు ఎగుమతి చేశారు. ఇంకా 20 లారీల మేర కాంటా వేయని ధాన్యం నిల్వ ఉంది. ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షంతో కల్లాల్లోని కొంతమంది రైతుల ధాన్యం కొట్టుకుపోగా, మరికొందరి రైతుల ధాన్యం తడిసి ముద్దయింది. దీంతో ఆగ్రహించిన రైతులు అమ్మనబోలులో తడిసిన ధాన్యం బస్తాలతో రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న డీసీఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వర్‌రావు, డీసీవో కిరణ్‌కుమార్, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. రోజుకు నాలుగు నుంచి ఐదు చొప్పున లారీలను పంపించి త్వరగా ధాన్యం తరలించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించి ఆందోళన విరమించారు. ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంగా నిమ్మ చెట్లు వేర్లు సహా నేలకూలాయి. గ్రామానికి చెందిన ఒర్రె నర్సింహకు చెందిన తోటలో ఎకరం విస్తీర్ణంలోని సుమారు 25 పెద్ద నిమ్మచెట్లు దెబ్బతిన్నాయి. మండలంలోని అక్కినపల్లిలో చెట్లకొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో వెంటనే స్పందించిన గ్రామస్థులు విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సరఫరా నిలిపివేశారు. గ్రామస్థుల సహకారంతో చెట్లను తొలగించి విద్యుత్ సరఫరాను అధికారులు పునరుద్ధరించారు. నార్కట్‌పల్లి ఆవాస గ్రామమైన చౌటబావిలో శివారులో తాటిచెట్టుపై పిడుగు పడింది. దీంతో చెట్టు కాలిపోగా, సమీపంలోని కొందరు యువకులు ఆ దృశ్యాన్ని వీడియో తీశారు. చిట్యాల మండలంలోని పలు గ్రామాల్లో ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన అకాల వర్షం వచ్చింది. ఈదురుగాలులకు రేకుల షెడ్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోగా మామిడి చెట్ల కాయ నేలరాలాయి. ఈదురుగాలులకు వనిపాకల గ్రామంలోని పలు ఇళ్ల రేకుల కప్పులు కూలిపోయాయి. వెలిమినేడు, గుండ్రాంపల్లిలో మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. నేరడ గ్రామంలోని రైస్ మిల్లుపై పిడుగు పడటంతో ఆస్తినష్టం వాటిల్లింది. వెలిమినేడు, పిట్టంపల్లితో పాటు పలు గ్రామాల్లోని పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది.



అమ్మనబోలులో రాస్తారోకో చేస్తున్న రైతులు



పిట్టంపల్లిలో ధాన్యం రాశుల చుట్టూ చేరిన నీరు



హాలియా సభలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పక్కన అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి

బీజేపీ, బీఆర్‌ఎస్ డిపాజిట్లు గల్లంతు

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి •7లో..



తిట్లతోనే కాలం వెళ్లదీస్తున్న సీఎం

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి •7లో..

నాలుగో రోజు 21 నామినేషన్లు

నల్లగొండలో 10, భువనగిరిలో 11 మంది దాఖలు

నల్లగొండటౌన్, యాదాద్రి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలకు నాలుగో రోజైన సోమవారం 21 నామినేషన్లు దాఖలయ్యాయి. నల్లగొండ స్థానానికి నల్లగొండలో, భువనగిరి స్థానానికి యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో నామినేషన్లను దాఖలు చేశారు. నల్లగొండ పార్లమెంట్ స్థానానికి 10మంది అభ్యర్థులు, భువనగిరి స్థానానికి 11 స్థానాలు మంది నామినేషన్లు దాఖలు చేశారు. నల్లగొండ స్థానంలో ఆరుగురు వివిధ పార్టీలకు చెందిన వారు కాగా నలుగురు స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. ప్రధానంగా బీజేపీ తరఫున శానంపూడి సైదిరెడ్డి రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రీఫామ్ (ఆధార్) పార్టీ తరఫున ఏడనాగ్ పుల్లారావు, ఎంసీపీఐ(యు) వస్కుల మట్టయ్య, తెలంగాణ సకల జనుల పార్టీ తరఫున నందిపాటి జాన య్య, ధర్మసమాజ్‌పార్టీ నుంచి తలారి రాంబాబు, రిప్లబికన్ సేన పార్టీ తరఫున వంగపల్లి కృష్ణ నామినేషన్లు వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా మర్రి నెహేమియా, పానుగోతు లాల్‌సింగ్ నాయక్, చెదల్ల వెంకట సాంబశివరావు, లింగం కృష్ణ నామినేషన్లు దాఖలు చేశారు. భువనగిరి స్థానానికి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా క్యామ మల్లేష్ మూడు సెట్లు, జైభారత్ పార్టీ నుంచి నల్ల కరుణాకర్‌రెడ్డి, పీపుల్స్ ప్రొటెక్షన్ పార్టీ అభ్యర్థిగా వింధ్యాల సదానందరెడ్డి రెండు సెట్లు, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా కొంగర లింగస్వామి రెండు సెట్లు, తెలంగాణ రిపబ్లిక్ పార్టీ అభ్యర్థిగా కందాడి మ ణిపాల్‌రెడ్డి ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థులుగా నక్కల సురేందర్, వరికుప్పల క్రిష్ణ, బాషబోయిన లక్ష్మయ్య, కొంగరి మల్లేష్, ఈదుల వీర పాపయ్య, గ్యాదపాక అనిల్‌కుమార్ ఒక సెట్ చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు.

నామినేషన్ కౌంటర్ (4వ రోజు)

నియోజకవర్గం	22న దాఖలు	గతంలో దాఖలు	మొత్తం
నల్లగొండ	10	15	25
భువనగిరి	11	13	24
మొత్తం	21	28	49



నల్లగొండలో బీజేపీ ర్యాలీ, నామినేషన్ పత్రాలను చూపుతున్న అభ్యర్థి సైదిరెడ్డి



కలెక్టర్‌కు నామినేషన్ పత్రం అందజేస్తున్న భువనగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్

ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకులది కీలక పాత్ర

ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి శ్రవణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి శ్రవణ్‌కుమార్

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 22: లోక సభ ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకులది కీలక పాత్ర అని జిల్లా ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి, జేడీఏ శ్రవణ్ అన్నారు. సోమవారం జడ్పీ ఆడిటోరియంలో నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. తొలి విడత 374 మంది సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. పోలింగ్ పూర్తయ్యేవరకు పరిశీలకులు పూర్తి అప్రమత్తంగా ఉంటూ పోలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలు కల్పించింది లేనిది పరిశీలించాలన్నారు. మాక్ పోలింగ్, రహస్య ఓటింగ్ విధానంలో పోలింగ్ జరుగుతున్నది లేనిదీ చూడాలన్నారు. పోలింగ్ రోజున ఎన్నికల పరిశీలకులకు చెక్ లిస్టులో అన్ని వివరాలు రిపోర్ట్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎల్డీఎం శ్రామిక్, మాస్టర్ ట్రైనర్ బాలు, తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు: డీఈవో

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 22: వేసవి సెలవుల్లో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు స్పెషల్ క్లాసులు నిర్వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖాధికారి భిక్షపతి సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. 2023-2024 విద్యాసంవత్సరం మంగళవారంతో ముగిసి బుధవారం నుంచి వేసవి సెలవులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ మేరకు నిబంధనలు పాటించాలని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలను ఆదేశించారు.

ధాన్యాన్ని మద్దత ధరకు కొనుగోలు చేయాలి

పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ డీఎస్ చౌహాన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సెక్రటరీ చౌహాన్, హాజరైన అధికారులు

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 22: మిల్లర్లు ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, అంతకు తక్కువ ధర చెల్లిస్తే తగిన చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాలశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ డీఎస్ చౌహాన్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. కొనుగోలు చేసిన వెంటవెంటనే ధాన్యాన్ని మిల్లులకు ఎగుమతి చేయించాలన్నారు. రైతులకు రెండు రోజుల్లో డబ్బు వారి బ్యాంకు ఖాతాలో జమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి వి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొనుగోళ్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ కొనుగోళ్ల వేగవంతం చేస్తున్నామన్నారు. సమావేశంలో పౌరసరఫరాలశాఖ మేనేజర్ నాగేశ్వర్‌రావు, జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమర్, తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలుచేస్తాం

నార్కట్‌పల్లి: అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని చివరి గింజ వరకూ కొంటామని జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం నార్కట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో చిట్యాల, నార్కట్‌పల్లి మండలాల పరిధిలోని రైస్ మిల్లుల యజమానులతో సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 370 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 15 రోజుల వ్యవధిలో 1.95లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేశామన్నారు. రైతుల ఖాతాలో ఇప్పటికే రూ. 213కోట్లు జమచేశామని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటికే 50 నుంచి 60 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు పూర్తికావొచ్చిందని, మిగతా కేంద్రాల్లో కూడా 15 రోజుల్లో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారు. వర్షానికి ధాన్యం తడవకుండా 6,000 టార్పాలీన్లు అందజేశామన్నారు. ఆయన వెంట డీఎంసీఎస్ నాగేశ్వర్‌రావు, డీసీవో కిరణ్‌కుమార్, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఆర్‌ఐలు లింగస్వామి, తరుణ్, మిల్లర్లు తేరటుపల్లి హనుమంతు, పందిరి శ్రీనివాస్, వనపర్తి వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

రైలు కింద పడి విద్యార్థి ఆత్మహత్య

గరిడేపల్లి, మిర్యాలగూడ అర్బన్ ఏప్రిల్ 22: రైలు కింద పడి ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు, మిత్రులు తెలిపిన వివరా ల ప్రకారం.. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం లుంబాతండాకు చెందిన గుగులోతు బాలు కుమారుడు విజయ్(22) హైదరాబా ద్‌లోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో బీఎస్సీ డిగ్రీ డయాలసిస్ కోర్సు చేస్తున్నాడు. ఐదుగురు మిత్రులతో కలిసి దిల్‌సుఖ్‌నగర్‌లో రూం తీసుకొని ఉంటున్నా డు. శనివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో కళాశాల నుంచి గదికి వచ్చి భోజనం చేశాక కాసేపు నిద్రించాడు. సాయంత్రం సుమారు నాలుగు గంటల సమయంలో స్నేహి తులకు చెప్పకుండా బయటికి వెళ్లాడు. రాత్రి 10 గంటలకు రూంలో చూస్తే బ్యాగు లేకపోవడంతో స్నేహితులు విజయ్ ఇంటికి ఫోన్ చేసి సమాచారం అందించారు. విజయ్ ఇంటికి రాలేదని, ఈమధ్య ల్యాప్‌టాప్ తీసుకొంటానని రూ.40వేలు తీసుకెళ్లాడని కుటుంబ సభ్యులు తెలిపారు. విజయ్ ఉదయం వరకు రాకపోయేసరికి ఆదివారం ఉదయం చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి సుమారు 12గంటల ప్రాంతంలో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం అందింది. సోమవారం మిర్యాలగూడ రైల్వే అధికారులు పోలీసులకు, ఉత్తరంలోని ఫోన్‌నెంబర్ల ఆధారంగా విజయ్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి వెళ్లి పంచనామా తర్వాత మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. తన మృతికి ఎవరూ కారణం కాదని సూసైడ్ నోట్ రాశాడు. తన రూంలోని స్నేహితులు, కుటుంబసభ్యులను ఇబ్బంది పెట్టొద్దని రాశాడు. 'నేను జీవితంలో ఏమీ సాధించలేనని, నా చావుకు నేనే కారణం' అని రాశాడు. అందులో తన తండ్రి, బంధువు, తన రూంమేట్స్‌కు సంబంధించిన మూడు ఫోన్ నెంబర్లు రాసినట్లు స్నేహితులు తెలిపారు.

విజయ్(ఫైల్)

రూ.3.37లక్షలు పట్టివేత

తిరుమలగిరి, కోదాడ రూరల్, ఏప్రిల్ 22: సూర్యాపేట జిల్లా తిరుమలగిరి, కోదాడ మండలాల్లో తనిఖీల్లో భాగంగా రూ.3.37లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తిరుమలగిరి మునిసిపాలిటీ పరిధిలోని ఈదులపర్రెతండా వద్ద చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలలో నగదు పట్టుకున్నట్లు ఎస్‌ఐ సత్యానారాయణ తెలిపారు. సోమవారం చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేస్తుండగా ఆటోలో లింగాలఘనపురం మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన బండి మల్లేష్ పశువుల వ్యాపారి వద్ద రూ.2.47లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్‌చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌టి టీం లీడర్ ఏంపీవో మారయ్య, ఎస్‌ఎస్‌టీ టీంలీడర్ డీటీ జాన్‌మహ్మద్, పోలీస్ సిబ్బంది వెంకన్న, మల్లయ్య, నరేష్ షర్మ, నాగేష్ తదితరులు పాల్గొన్నారు. కోదాడ మండలంలోని రామాపురం క్రాస్‌రోడ్డు చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో రూ.90 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. విజయవాడ నుంచి హైద్రాబాద్ వైపు వెళ్తున్న వాహనంలో ఈ నగదు లభించిందని తెలిపారు. నగదును సీజ్ చేసి ఎన్నికల అధికారికి అప్పగించినట్లు తెలిపారు.

ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమను తెచ్చేది బీజేపీనే

● కేంద్రన్యాయశాఖ మంత్రి కిరణ్‌రిజిజు



నల్లగొండ రోడ్‌షోలో ప్రసంగిస్తున్న కిరణ్‌రిజిజు, పక్కన బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): నల్లగొండ ఎంపీగా బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డిని గెలిపిస్తే కేంద్రంలో మరోసారి కొలువుదీరే నరేంద్రమోదీ సర్కార్ నల్లగొండలో ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేస్తుందని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు హామీ ఇచ్చారు. బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి నామినేషన్ సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో సోమవారం బీజేపీ నిర్వహించిన ర్యాలీకి ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కిరణ్‌రిజిజు మాట్లాడుతూ దేశమంతా మహిళలు, రైతులు, యువత మరోసారి నరేంద్రమోదీ సర్కార్ రావాలని ఆకాంక్షిస్తున్నారని, నల్లగొండలోనూ సైదిరెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టాక దేశం గర్వపడేలా ఆయన పనిచేశారన్నారు. రాష్ట్రంలోనూ ఆబాలగోపాలం మోదీ ప్రభుత్వమే రావాలని కోరుకుంటోన్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలేవీ అమలు చేయడం లేదని నిలదీశారు.

నాలుగుకుటుంబాల పాలనను అంతమొందించాలి : వెంకటరమణారెడ్డి

నల్లగొండలో నాలుగు కుటుంబాల పాలనను అంతమొందించాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కోరారు. ఇద్దరు సీఎంలను ఓడగొట్టిన బీజేపీ కార్యకర్తలు నల్లగొండలో ఇద్దరు మంత్రుల పదవులు ఊడగొట్టేలా ఎంపీ ఎన్నికల్లో 2 లక్షల మెజార్టీతో సైదిరెడ్డిని గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం లేకున్నా, బీజేపీ ఎమ్మెల్యేలు, బీజేపీకి చెందిన స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు లేకపోయినా మోదీ సర్కార్ పక్షపాతం లేకుండా జాతీయరహదారులను నిర్మించిందన్నారు. అభివృద్ధికి దోహదపడిందని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలే తప్ప ప్రజలకు చేస్తుందేమీలేదని నిలదీశారు. ప్రధానిగా కాంగ్రెస్‌కు అభ్యర్థే లేరని, రాహుల్‌గాంధీ పేరుచెప్పి ఎందుకు ఓట్లు అడగలేకపోతున్నారని ఎద్దేవాచేశారు. బీజేపీ ఎక్కడుందన్న మంత్రి కోమటిరెడ్డికి నల్లగొండ నడిబొడ్డున కాషాయజెండాలు కనబడడం లేదా అన్నారు. నల్లగొండలో బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు.

అన్నివర్గాల సమగ్రాభివృద్ధి బీజేపీతోనే: సైదిరెడ్డి

యువత, మహిళలు, రైతులు, కూలీల వరకు అన్నివర్గాల సమగ్రాభివృద్ధి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమని బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టక ముందు దేశంలో నిరుద్యోగం తాండవించిందని, మోదీ సర్కార్ కొలువుదీరాక యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు మెరుగుపడ్డాయన్నారు. రాష్ట్రంలో పంటలకు బోనస్ ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రైతులకు, కూలీలకు ఉపాధి లేక రూ.200 కూలి కోసం ఏపీకి వెళ్తున్నారని, తనను ఎంపీగా గెలిపిస్తే, ఇక్కడే చేతినిండా పని లభించేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, నూకల నరసింహారెడ్డి, గోలిమధుసూదన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, పోతేపాక సాంబయ్య, పిల్లి రామరాజు యాదవ్, కంకణాల నివేదితరెడ్డి, నాయకులు పాల్గొన్నారు. సైదిరెడ్డి నామినేషన్ సందర్భంగా నల్లగొండలో బీజేపీ కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్లాక్‌టవర్ వద్ద మహిళలు కోలాటం నిర్వహించారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు డిపాజిట్లు గల్లంతు

● ఎన్నికల తర్వాత కొత్తరేషన్‌కార్డులు ఇస్తాం
● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, పక్కన అభ్యర్థి రఘువీర్‌రెడ్డి

హాలియా, ఏప్రిల్ 22 : పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా రావని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా హాలియాలో నిర్వహించిన నాగార్జునసాగర్ నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టిందని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అందుకోసం ఇండియా కూటమి గెలుపు చరిత్రాత్మక అవసరమన్నారు. రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తానన్న మోదీ వారి ఆదాయాన్ని తగ్గించారని ఆరోపించారు. బీజేపీ వారికి ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ మనుగడ ఉండదన్నారు. దేశంలోనే అత్యధిక మెజార్టీని నల్లగొండ పార్లమెంట్ నుంచి రఘువీర్‌కు అందించాలని కోరారు. రాష్ట్రంలో 14 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ఎన్నికల తర్వాత కొత్త రేషన్‌కార్డులు ఇస్తామన్నారు. సాగర్‌లో 35 వేల ఎకరాలు ఎత్తిపోతల ద్వారా సాగవుతుందని వాటి పూర్తి మరమ్మతు బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. నెల్లికల్లు ఎత్తిపోతలను రూ.200 కోట్లతో రెండేళ్లలో పూర్తి చేసి ఏడు వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు.

రెండు లక్షల ఎకరాలకు నీరందించా : జానారెడ్డి

ఉమ్మడి రాష్ట్రంలోనే రెండు లక్షల ఎకరాలకు, సాగర్ ప్రజలకు సాగునీరు అందించిన ఘనత తనదని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్యం తెచ్చిందని, తెలంగాణ ఇచ్చిందని, అనేక ప్రాజెక్టులు కట్టిందన్నారు. పోడుభూముల చట్టం ద్వారా రాష్ట్రంలో 8 లక్షల మందికి లబ్ధి చేకూరిందన్నారు. స్వామినాథన్ కమిషన్ ఏర్పాటును మోదీ ప్రభుత్వం విస్మరించిందన్నారు. రావి నారాయణరెడ్డికి అందించిన మెజార్టీని రఘువీర్‌రెడ్డికి అందించాలని ప్రజలను ఆయన కోరారు.

కార్యకర్తలను కాపాడుకుంటా: రఘువీర్‌రెడ్డి

కార్యకర్తలను కడుపులో పెట్టుకుని కాపాడుకుంటానని నల్లగొండ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. పార్టీ విజయం కోసం కష్టపడి సమన్వయంతో పని చేసి అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. ఈప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉంటానన్నారు. డాక్టర్ పాల్వాయి వెంకట్‌రెడ్డి రఘువీర్‌పై రూపొందించిన పాటను మంత్రి ఉత్తమ్ ఆవిష్కరించారు. సమావేశానికి కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు. సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, బాలునాయక్, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు కర్నాటి లింగారెడ్డి, కాకునూరి నారాయణగౌడ్, మలిగిరెడ్డి లింగారెడ్డి, తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడి, కుందూరు వెంకట్‌రెడ్డి, యడవల్లి రంగసాయిరెడ్డి, కొండేటి మల్లయ్య, గాలి రవికుమార్, వెంపటి శ్రీనివాస్, శంకర్‌నాయక్, అంగోతు భగవాన్‌నాయక్, చింతల చంద్రారెడ్డి, గౌని రాజారమేష్‌యాదవ్, మాదవి, కట్టెబోయిన అనిల్‌కుమార్, సర్వయ్య, రాజశేఖర్‌రెడ్డి, అంకతి సత్యం, బుచ్చిరెడ్డి, చంద్రశేఖర్, కృష్ణనాయక్, రావుల చినబిక్షం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌పై తిట్లతోనే కాలం వెళ్లదీస్తున్న సీఎం



భువనగిరిలో జరిగిన సమావేశంలో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

యాదాద్రి-ఆంధ్రజ్యోతి/నార్కట్‌పల్లి / భువనగిరి రూరల్, ఏప్రిల్ 22: అసెంబ్లీ ఎన్నికల్లో హామీలు నెరవేర్చకుండా మాజీ సీఎం కేసీఆర్‌ను తిడుతూ సీఎం రేవంత్‌రెడ్డి కాలం వెళ్లదీస్తున్నాడని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకంట్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి రోడ్‌షోలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటల తీరును గమనిస్తే కాంగ్రెస్ పార్టీ ఓటమిని అంగీకరించినట్లుగా ప్రజలు భావిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ మాట్లాడుతూ కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి వీధిరౌడీలా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు.కాంగ్రెస్ కార్యకర్తలు రేవంత్‌రెడ్డి దుస్తులు ఊడదీసి కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. తనను గెలిపిస్తే సేవకుడిగా ఉంటూ నియోజకవర్గాల అభివృద్ధికి అహర్నిషలు కృషి చేస్తానన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ భువనగిరి అభ్యర్థి క్యామ మల్లేష్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రులు ఎలిమినేటి ఉమామాధవరెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, జడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, గాదరి కిషోర్, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 25వ తేదీన మాజీ సీఎం కేసీఆర్ రోడ్‌షో సందర్భంగా ఏర్పాట్లను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడే భాష సంస్కారహీనంగా ఉందని, తన పాలనలో చేసింది ఏమీలేకనే కేసీఆర్‌పై రోత భాష మాట్లాడుతున్నారని విమర్శించారు.

అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తా

గుండాల : ఎంపీగా తనకు అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని భువనగిరి బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా గుండాలలో సోమవారం రాత్రి రోడ్‌షోలో మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, భిక్షమయ్యగౌడ్, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి, నాయకులు ఎండీ కలీల్, మందడి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల విశ్వాసం కోల్పోయిన రాష్ట్ర ప్రభుత్వం

● బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి



పీఏపల్లి రోడ్‌లో పాల్గొన్న కంచర్ల కృష్ణారెడ్డి

పెద్దఅడిశర్లపల్లి / కొండమల్లేపల్లి/ పెద్దవూర, ఏప్రిల్ 22 : అమలు సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కొద్ది రోజుల పాలనలోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని నల్లగొండ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి అన్నారు. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి, కొండమల్లేపల్లి, పెద్దవూర మండలాల్లో ప్రచారంలో భాగంగా రోడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ భృతి, కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం, మహిళలకు రూ.2500, నెలకు రూ.4 వేల పింఛన్, రైతు భరోసా ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. రైతు కూలీలకు రూ.12 వేల ఊసేలేదన్నారు. ఆయా రోడ్ షోలలో బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర కుమార్, రాజ్యసభసభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నాయకులు రామచందర్‌నాయక్, యడవెల్లి విజయేందర్‌రెడ్డి, చెన్ను సుందర్ రెడ్డి, నడ్డి లింగయ్యయాదవ్, కిషన్‌నాయక్, మహేందర్, స్వామినాయక్, కృష్ణరెడ్డి, ఇబ్రహీం, శ్రీనునాయక్, యోల్లగిరి వల్లపురెడ్డి, అంజిరెడ్డి, ముత్యంరావు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

పెద్దవూర, దామరచర్ల, కట్టంగూరు, ఏప్రిల్ 22: నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. పెద్దవూర మండలంలో రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు మృతిచెందారు. దామరచర్ల మండలంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు, కట్టంగూరు మండలంలో బైక్ అదుపుతప్పి కింద పడడంతో మరొకరు మృతిచెందారు.

రెండు బైక్‌లు ఢీకొని..



మహేందర్, లచ్చు(ఫైల్)

నల్లగొండ జిల్లా అనుముల మండలం పంగవానికుంట గ్రామానికి చెందిన నీలం మహేందర్(21) తన బైక్‌పై ఆదివారం ఉదయం 11గంటలకు ఇంటి నుంచి బయలుదేరి గుర్రంపోడు మండలంలోని కొప్పోల్ గ్రామంలో గల తన బంధువుల ఇంటికి వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా రాత్రి 10గంటల సమయంలో పెద్దవూర మండల శివారులోని పత్తి మిల్లు వద్దకు రాగానే కొండమల్లెపల్లి మండలం కొర్రోనితండా గ్రామానికి చెందిన నేనావత్ లచ్చు(35) తన ద్విచక్ర వాహనంపై వస్తూ ఎదురుగా వస్తున్న మహేందర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో ఇద్దరు కిందపడిపోగా ఇద్దరికి తలలకు గాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడిన మహేందర్ అక్కడికక్కడే మృతిచెందాడు. లచ్చును చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా సోమవారం రాత్రి చనిపోయాడు. మహేందర్‌కు వివాహం ఆలేదు. లచ్చుకి భార్య మంజుల, ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. మహేందర్ అన్న భిక్షం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

నల్లగొండ జిల్లా హాలియాకు చెందిన దేవనబోయిన కృష్ణయ్య(55) డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. దామరచర్ల మండలకేంద్రం శివారులో డీసీఎం టైర్ పంక్చర్ కావడంతో దుకాణం వద్ద లారీని నిలిపాడు. టైర్ పంక్చర్ చేయించుకొని తిరిగి డీసీఎం వాహనం ఎక్కుతున్న క్రమంలో మిర్యాలగూడ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయాలై కృష్ణయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కృష్ణయ్య భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఐరుగు రవికుమార్ తెలిపారు. కృష్ణయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

బైక్ అదుపు తప్పి..

నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని కురుమర్తి గ్రామానికి చెందిన చల్ల భిక్షం(51) ఆదివారం నకిరేకల్ గ్రామంలోని తన బంధువుల వివాహానికి వెళ్లాడు. తిరిగి రాత్రి బైక్‌పై స్వగ్రామమైన కురుమర్తికి వస్తుండగా కట్టంగూరు మండలంలోని అయిటిపాముల గ్రామం శివారులో 65వ నెంబర్ జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడడంతో తలకు గాయాలయ్యాయి. చికిత్స కోసం 108లో నార్కట్‌పల్లి సమీపంలోని కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతిచెందాడు. భిక్షం కుమారుడు జగదీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీను తెలిపారు.

సీఎంఆర్ బకాయిలు రూ.500 కోట్లు

● బకాయిదారులపై ఆర్ఆర్ యాక్ట్ ● చెల్లిస్తే ఎవరిపైనా చర్యలు ఉండవు ● సూర్యాపేట జిల్లా కలెక్టర్ వెంకటరావు



తమ్మరలోని రైస్‌మిల్‌లో బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరావు

కోదాడ రూరల్, ఏప్రిల్ 22: సూర్యాపేట జిల్లాలో సీఎంఆర్ బకాయిలు రూ.500కోట్ల వరకు ఉంటుందని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటరావు తెలిపారు. ప్రభుత్వ ధాన్యాన్ని విక్రయించుకున్న మిల్లర్లపై ఆర్ఆర్ యాక్ట్ కింద కేసు నమోదు చేయడంతో పాటు వారి ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు. సోమవారం సూర్యాపేట జిల్లా కోదాడ మండలం తమ్మరలోని ధనలక్ష్మి, వసుంధర పార్‌బాయిల్డ్ రైస్‌మిల్లులను ఆయన తనిఖీ చేశారు. ఆయా మిల్లులకు ప్రభుత్వం గత వానాకాలం సీజన్‌లో సీఎంఆర్ కింద ధాన్యం కేటాయించిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం మిల్లులు ఇంకా బియ్యం ఇవ్వాల్సి ఉండటంతో మిల్లులను తనిఖీ చేసి వెంటనే బియ్యం ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలో గతేడాది సీఎంఆర్ ధాన్యం తీసుకుని, బియ్యం ఇవ్వకుండా ధాన్యాన్ని కూడా విక్రయించిన మిల్లర్లపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. అందులో భాగంగా ఇప్పటికే ఆయా మిల్లర్లపై కేసులు నమోదు చేయాలని ఆదేశాలిచ్చామన్నారు. వారి ఆస్తులను కూడా రెవెన్యూ రికవరీ యాక్టు ప్రకారం జప్తు చేస్తామన్నారు. జిల్లాలో ఇప్పటికే సీఎంఆర్ కింద ధాన్యం తీసుకుని, బియ్యం ఇవ్వకుండా ధాన్యం విక్రయించారని తెలిపారు. జిల్లాలో మిల్లర్ల బకాయిలు సుమారు రూ. 500కోట్ల వరకు ఉంటాయన్నారు. బకాయిలు చెల్లిస్తే ఎటువంటి చర్యలు ఉండవన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ సాయిగౌడ్, డీటీసీఎస్ రామిరెడ్డి, సివిల్ సప్లయ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరారీలో రైస్‌మిల్ యజమాని సత్యనారాయణ

సుమారు రూ.90 కోట్ల మేర సీఎంఆర్ బకాయిలు ఉన్న కోదాడ మండలం కొమరబండలోని శ్రీ వేంకటేశ్వర పార్‌బాయిల్డ్ రైస్‌మిల్లు యజమాని నీలా సత్యనారాయణ పరారీలో ఉన్నాడని రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. బియ్యం సరఫరాలో అవకతవకలపై సివిల్ సప్లయ్ అధికారుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశామన్నారు. అయితే మిల్లు యజమాని నీలా సత్యనారాయణను తాము అదుపులోకి తీసుకున్నట్లు వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని ఆయన తెలిపారు. స్థానిక పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆయనను అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిసింది. మిల్లు యజమాని నీలా సత్యనారాయణ కోర్టులో లొంగిపోయి బెయిల్ పొందేందుకు తన న్యాయవాదులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం.

ఆభరణాలు దొంగిలించిన నిందితుల అరెస్టు

కట్టంగూరు, ఏప్రిల్ 22: బంగారు ఆభరణాలు దొంగిలించిన నిందితులను పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేశారు. కట్టంగూరులోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శాలిగౌరారం రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది జనవరి 23వ తేదీ మధ్యాహ్నం నకిరేకల్‌కు చెందిన మోత్కూరి లక్ష్మయ్య, అతని భార్య లక్ష్మమ్మ కలిసి హైదరాబాద్‌లో ఉంటున్న తన కూతురు వద్దకు వెళ్లేందుకు నకిరేకల్‌లో బస్సు ఎక్కారు. మార్గమధ్యలో కట్టంగూరు మండలంలోని అయిటిపాముల గ్రామానికి వచ్చేసరికి తమ వద్దనున్న బ్యాగ్‌లో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బ్యాగులో ఉన్న సుమారు 20తులాల బంగారు ఆభరణాలు దొంగిలించారు. బాధితులు జనవరి 27వ తేదీన కట్టంగూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ నెల 22వ తేదీ ఉదయం 9గంటల సమయంలో శాలిగౌరారం సీఐ, కట్టంగూరు ఎస్ఐతో పాటు పోలీసులు కట్టంగూరులోని నల్లగొండ క్రాస్ రోడ్డు వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా హైదరాబాద్ నుంచి సూర్యాపేట వెళ్తున్న లారీ నుంచి ఇద్దరు మహిళలు, ఒక వ్యక్తి నల్లగొండ క్రాస్ రోడ్డు వద్ద దిగి అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. బస్సులో ఆభరణాలు తామే దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారని, వారివద్ద నుంచి ఐదు తులాల బంగారం, రూ.2వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. దొంగతనాలకు పాల్పడిన వారిలో సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన ఓర్సు కవిత, సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన భార్యాభర్త సంపంగి యాదగిరి, తిరుపతమ్మను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితులందరూ హైదరాబాద్ హయత్‌నగర్‌లోని పెద్దఅంబర్‌పేట వద్ద నివాసం ఉంటున్నారు. నిందితులపై గతంలో మిర్యాలగూడ, హాలియాతో పాటు సూర్యాపేట, ఖమ్మం జిల్లాలో కూడా దొంగతనం కేసులు నమోదు అయినట్లు తెలిపారు.

హత్య కేసులో జీవిత ఖైదు

తుర్కపల్లి, ఏప్రిల్ 22: హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు, రూ.10వేల జరిమానా విధిస్తూ యాదాద్రిభువనగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. జయరాజు తీర్పు ఇచ్చారు. తుర్కపల్లి ఎస్ఐ తక్యుయోద్దీన్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాధాపూర్ గ్రామానికి చెందిన ఎర్రబెల్లి వెంకటేశానికి 15 సంవత్సరాల క్రితం సిద్దిపేట జిల్లా మామిడ్యాల గ్రామానికి చెందిన కృష్ణవేణితో వివాహం జరిగింది. వారికి ముగ్గురు కుమారులు ఉన్నారు. భార్యాభర్తలు తరుచూ గొడవ పడుతుండేవారు. 2021 డిసెంబరు 24న వారి మధ్య జరగడంతో కృష్ణవేణి సోదరుడు రాచకొండ రమేశ్ తన బావ వెంకటేశంను సోదరితో గొడవ ఎందుకు పడుతున్నావని నిలదీశాడు. వెంకటేశం కోపంతో తన బావమరిది రమేశ్‌పై ఇటుకతో దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను భువనగిరి జిల్లాకేంద్ర ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. రమేష్ భార్య అనీత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి యాదగిరిగుట్ట సీఐ నవీన్‌రెడ్డి, ఎస్ఐ మధుబాబు కేసు నమోదు చేశారు. కేసు విచారణ జరిపి నేరం రుజువు కావడంతో ఎర్రబెల్లి వెంకటేశంకు జీవిత ఖైదు, రూ.10వేల జరిమానా విధిస్తూ జిల్లాప్రధాన న్యాయమూర్తి జయరాజు తీర్పు ఇచ్చారు.

బాలుడి మృతదేహానికి రీ పోస్టుమార్టం

భువనగిరి రూరల్, ఏప్రిల్ 22: నీటి సంపులో పడి బాలుడు మృతి చెందిన ఘటనపై తహసీల్దార్ సమక్షంలో పోలీసులు, వైద్యులతో సోమవారం రీ పోస్టుమార్టం జరిపించారు. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని రెడ్డినాయక్‌తండాకు చెందిన దంపతులు భూక్య భాను ప్రకాశ్ శైలజ కుమారుడు భూక్య విక్రమ్(22 నెలలు) ఈ నెల 11న సాయంత్రం 6గంటలకు ఇంటి ముందు గల సంపులో పడి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఆ బాలుడిని అదే రాత్రి 11గంటలకు ఖననం చేశారు. కుమారుడి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ తండ్రి భూక్య భానుప్రకాశ్ సోమవారం రీ పోస్టుమార్టం చేయించాలని భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తహసీల్దార్ ఎన్.అంజిరెడ్డి వైద్యులు డాక్టర్ స్వప్న, సీఐ ప్రభాకర్‌రెడ్డి, గ్రామస్థుల సమక్షంలో బాలుడి మృతదేహానికి రీ పోస్టుమార్టం చేసినట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

లాడ్జిలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 22: అనుమానాస్పద స్థితిలో లాడ్జిలో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో జరిగింది. సీఐ రమేష్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని ఓ ప్రైవేట్ లాడ్జిలో ఆదివారం సాయంత్రంలో ఇద్దరు పురుషులు, మహిళ, పాప కలిసి గది అద్దెకు తీసుకొని రాత్రి బస చేశారు. సోమవారం ఉదయం లాడ్జి నిర్వాహకులు గదివైపు పరిశీలించగా అందులో సుమారు 40సంవత్సరాల వయస్సున్న వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నాడు. వెంట వచ్చిన మరో వ్యక్తి, మహిళతో పాటుగా పాప అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో లాడ్జీ నిర్వాహకుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద స్థితి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతునికి వివరాలు ఎవరికైనా తెలిస్తే వెంటనే సెల్: నంబర్ 871266476కు సమాచారం ఇవ్వాలని సూచించారు. లాడ్జీ నిర్వాహకులు అద్దెకు తీసుకున్న వ్యక్తుల నుంచి ఆధార్‌కార్డు, ఓటరు కార్డు ఎలాంటి గుర్తింపుకార్డులు తీసుకోకపోవడం పోలీసులకు సవాల్‌గా మారింది. కుటుంబసభ్యుడు మృతిచెందితే ఎలా వదిలివెళ్లిపోతారని అనుమానాలకు తావిస్తోంది. సహజంగా మృతిచెందాడా? లేదా హత్య చేసి పారిపోయారనే అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఆర్.. చేసి ప్రాణాలు కాపాడి

చిట్యాల, ఏప్రిల్ 22: రోడ్డు ప్రమాదంలో స్పృహ కోల్పోయిన వ్యక్తికి ఓ ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ సీపీఆర్ చేసి సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్సఅందించి ప్రాణాలు కాపాడారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాలలో సోమవారం జరిగింది. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని ధర్మపురానికి చెందిన చీరాల కృష్ణయ్య, చీరాల జనార్థన్‌బైక్‌పై హైదరాబాద్ నుంచి నార్కట్‌పల్లి వైపు వెళుతున్నారు. వారు చిట్యాల పట్టణానికి చేరుకునే సమయానికి రాత్రి తొమ్మిదిన్నర కావడం, వర్షం కురుస్తుండడంతో బైక్ అదుపుతప్పి పడిపోయింది. బైక్‌పై వెనకాల కూర్చున్న జనార్థన్‌కు తలకు దెబ్బ తగిలి స్పృహ కోల్పోయాడు. ఆ సమయంలో కారులో అటువైపు వచ్చిన చిట్యాల గ్రీన్‌గ్రోవ్ పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి ప్రమాదాన్ని చూసి గాయపడిన వ్యక్తికి సీపీఆర్ చేసి చికిత్స నిమిత్తం తన కారులో నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించారు. సీపీఆర్ చేయడంతోనే జనార్ధన్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని అక్కడి వైద్యులు తెలిపారు. సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన వేణుగోపాల్‌రెడ్డిని ఎస్ఐ సైదాబాబు సోమవారం సన్మానించారు.

బీఆర్ఎస్‌కు పలువురు నేతల రాజీనామా

మిర్యాలగూడ, మర్రిగూడ, మునుగోడు, ఏప్రిల్ 22: జిల్లాలోని పలు మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు పార్టీకి రాజీనామా చేశారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆయా నియోజకవర్గాలకు చెందిన నాయకులు పార్టీని వీడుతున్నారు.

● మిర్యాలగూడ నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు రాజీనామా చేశారు. మునిసిపల్ మాజీ చైర్మన్ గార్లపాటి నిరంజన్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాస్‌గౌడ్, అభ్యాస్ విద్యాసంస్థల చైర్మన్ వంగాల నిరంజన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్, మైనార్టీ సెల్ జిల్లా నాయకులు మదార్‌బాబా బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి అండగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బేషరతుగా మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. నల్లగొండ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి గెలుపు కోసం గ్రామాల్లో ప్రచారం సాగిస్తామన్నారు. సమావేశంలో నీటి సంఘం మాజీ చైర్మన్ గార్లపాటి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఎస్‌కె.మునీర్, గౌస్‌ఖాన్, తులసి, జావీద్ తదితరులు పాల్గొన్నారు.



నాగార్జునసాగర్‌లో పార్టీలో చేరిన నాయకులతో సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి

● మర్రిగూడ మండలంలోని భీమనపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు మునగాల అంతిరెడ్డి బీఆర్ఎస్ క్రియాశీలక సభ్యత్వానికి రాజీనామా చేసి, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డికి రాజీనామా పత్రాన్ని పంపినట్లు ఆయన తెలిపారు. సోమవారం భీమనపల్లి గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తన వ్యక్తిగత కారణాల వల్ల పార్టీకి పనిచేయడంలో సమయం కేటాయించలేకపోతున్నానని అందువల్ల పార్టీకి, క్రియాశీలక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేయడమే కాకుండా, సర్పంచ్‌గా ఉన్నప్పుడు గ్రామాలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు.

● మునుగోడు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండా పురుషోత్తంరెడ్డి తన వ్యక్తిగత కారణాల వల్ల పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీలో పనిచేసిన సమయంలో తనకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఏ పార్టీలో చేరేది త్వరలోనే ప్రకటిస్తానని పేర్కొన్నారు. పార్టీ రాజీనామా చేసిన ఆయన అధికార కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో కలిసి చర్చలు జరిపినట్లు తెలిసింది.



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ మాజీ చైర్మన్ గార్లపాటి నిరంజన్‌రెడ్డి

కాంగ్రెస్‌లో చేరిన మాజీ వైస్ చైర్మన్

నాగార్జునసాగర్: బీఆర్ఎస్‌కు చెందిన నందికొండ మునిసిపాలిటీ మాజీ వైస్‌చైర్మన్ మంద రఘువీర్ మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం సాగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పార్టీలో చేరారు. బీఆర్ఎస్ నుంచి 4వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందిన ఆయన నందికొండ మునిసిపాలిటీ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఇటీవల నిర్వహించిన అవిశ్వాస తీర్మానంలో వైస్‌చైర్మన్ పదవిని కోల్పోయాడు. దీంతో సోమవారం కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నాడు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, నాయకులు రాంబాబు, సంజీవయ్య, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారరథం ప్రారంభం

మిర్యాలగూడ, ఏప్రిల్ 22: నల్లగొండ పార్లమెంట్ బీఆర్ఎస్ ఎన్నికల రథాలను మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ప్రారంభించారు. పట్టణంలోని రెడ్డికాలనీలో గల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద సోమవారం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డితో కలిసి ప్రచార వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి విజయానికి కార్యకర్తలంతా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో దామరచర్ల ఎంపీటీసీ ఆంగోతు లలితహాతీరాం, ఎంపీపీ బాలాజీనాయక్, యాదగిరిరెడ్డి, వీరకోటిరెడ్డి, నల్లమోతు సిద్ధార్థ, బాబయ్య, ఖాజామొయినుద్దీన్, షోయబ్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.



కొబ్బరికాయ కొట్టి ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

పోలీస్ కుటుంబాలకు ఆర్థిక భరోసా : ఎస్పీ

నల్లగొండటౌన్, ఏప్రిల్ 22: పోలీస్ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు ఎస్పీ చందనా దీప్తి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏహెచ్‌టీయూ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ గుండెపోటుతో మృతి చెందిన పీసీ ఎస్‌కె. నజీర్ కుటుంబానికి భద్రతా పార్ట్ ఫైనల్ కింద రూ. 8 లక్షల చెక్కును సోమవారం ఎస్పీ ఆయన సతీమణి సయ్యద్ సనా సమ్రీన్‌కు అందజేశారు. కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చనిపోయిన పోలీసుల కుటుంబాలకు పోలీస్‌శాఖ అన్ని రకాలుగా అండగా నిలుస్తుందని, ప్రభుత్వం ద్వారా వారికి రావాల్సిన అన్ని రకాల లబ్ధి సాధ్యమైనంత త్వరగా ఇప్పించేలా కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సబిత, జేఆర్ ప్రమోద, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

కొనుగోళ్లలో నిర్లక్ష్యం చేయొద్దు

మర్రిగూడ, ఏప్రిల్ 22: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకువచ్చిన ధాన్యం కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం చేయవద్దని తహసీల్దార్ బక్క శ్రీనివాస్ అన్నారు. మండలంలోని శివన్నగూడ రైతు సేవా సహకార పరపతి సంఘం ఖుదాబక్షపల్లి, శివన్నగూడలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లోనే గిట్టుబాటు ధర లభిస్తుందని అన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రానికి తీసుకురావాలన్నారు. అనంతరం మౌలిక వసతులను పరిశీలించి ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట మనోహర్‌రావు, మధు, రైతులు తదితరులు ఉన్నారు.

● త్వరలో జరగనున్న ఎన్నికల్లో భాగంగా మర్రిగూడ తహసీల్దార్ శ్రీనివాస్ సోమవారం పోలింగ్‌బూత్ కేంద్రాలను పరిశీలించారు. మండలంలోని ఖుదాబక్షపల్లి, శివన్నగూడ, మేటిచందాపురం, కొట్టాల గ్రామా ల్లో ఉన్న ఎన్నికల పోలింగ్ బూత్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రంలో ఉన్న టువంటి మౌలిక వసతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పో లింగ్ కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలని అధికారులను కోరారు. ఆయన వెంట ఆర్‌ఐ బషీర్, కార్యదర్శులు ఉన్నారు.

నేడు వీరహనుమాన్ విజయయాత్ర

● ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

నల్లగొండ కల్చరల్, ఏప్రిల్ 22: హనుమాన్ విజయోత్సవ రోజు సందర్భంగా నల్లగొండ విశ్వహిందూ పరిషత్ - బజరంగ్‌దళ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున వీర హనుమాన్ విజయయాత్రను నిర్వహించనున్నారు. పాతబస్తీలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే పూజా కార్యక్రమానికి క్షేత్ర సంఘటన్ మంత్రి సత్యంజీ, పరమానంద భారతీస్వామి ముఖ్య అతిథులుగా హాజరై పూజలు నిర్వహించనున్నారు. అనంతరం లాంఛనంగా అక్కడి నుంచి వీరహనుమాన్ యాత్ర ప్రారంభం కానుంది. అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ సభ్యులు ముమ్మరంగా పూర్తి చేశారు. హనుమాన్‌నగర్ నుంచి మొదలైన వీర హనుమాన్‌యాత్ర పట్టణంలోని పాతబస్తీ, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, ప్రకాశంబజార్, క్లాక్ టవర్, రామగిరి, శివాజీనగర్, ఎన్జీ కళాశాల మీదుగా వీటీ కాలనీ వరకు సాగనుంది. యాత్ర ఆధ్యాత్మిక శోభతో జై హనుమాన్, జై శ్రీరామ్ అనే నినాదాలతో సాగనుంది. వీటీ కాలనీలోని పంచముఖ హనుమాన్ దేవాలయం వద్ద ముగుస్తుంది. విజయయాత్రలో హిందూ బంధువులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆర్ఎస్ఎస్ విభాగ్ సంఘ చాలక్ గార్లపాటి వెంకటయ్య, వీహెచ్‌పీ రాష్ట్ర సహకార్యదర్శి తోటభాను ప్రసాద్, రాష్ట్ర కో కన్వీనర్ కన్నెబోయిన వెంకట్, వీహెచ్‌పీ సహ కార్యదర్శి జూకురి సంపత్, భజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ యలిజాల నరసింహులు, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి మల్లెబోయిన నరసింహ పిలుపునిచ్చారు. హిందువుల ఐక్యతను చాటాలని పేర్కొన్నారు. పలు గ్రామాల నుంచి సభ్యులు పాల్గొననున్నారు. యాత్ర సందర్భంగా పట్టణ పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ప్రార్థన మందిరాల వద్ద నిఘాను ఏర్పాటు చేసింది. శాంతియుతంగా ర్యాలీని నిర్వహించుకోవాలని సూచించారు.



మిర్యాలగూడలో విజయయాత్ర గురించి వివరిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్: వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలోని వీరహనుమాన్ విజయయాత్ర నిర్వహించనున్నట్లు విభాగ్ అధ్యక్ష, కార్యదర్శులు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, గంజి సుధాకర్ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే శోభాయాత్ర పట్టణంలోని సాగర్‌రోడ్ మీదుగా సాగుతుందన్నారు. సిద్ధిపేట శ్రీ పీఠానికి చెందిన వీరధర్మజ స్వామిజీ ప్రసంగించనున్నట్లు తెలిపారు. భక్తులు శోభాయాత్రలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తల్లం వెంకన్న, నాంపల్లి రాంకుమార్, రాపర్తి శ్రీనివాస్, గౌరు ప్రవీణ్, కనపర్తి ప్రసాద్, జనార్ధన్, రవి తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలి

● బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 22: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే తగిన నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కురిసిన అకాల వర్షానికి మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో పంట నష్టపోయిన కౌలు రైతు శ్రవణ్‌గౌడ్ పంటలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అకాల వర్షాలకు పెద్ద ఎత్తున పంట నష్టం జరిగిందన్నారు. మామిడి, నిమ్మ, బత్తాయి పంటలకు జరిగిన పంట నష్టాలన్నీ వెంటనే అంచనావేసి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కష్టపడి పండించిన ధాన్యం అకాల వర్షానికి తడవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు పెట్టకుండా కొనుగోలు చేసి మద్దతు ధరను కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులు ఇబ్బందులు పడుతున్నా జిల్లా మంత్రి ఏమాత్రం పట్టించుకోకపోవడం లేదని ఆరోపించారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కల్వకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, రొమ్ముల నాగయ్య, కల్వకుంట్ల శ్రీకాంత్‌రెడ్డి, ఎస్‌కె లతీఫ్, ముక్కాముల వెంకన్న, వెంకటాచారి, సైదిరెడ్డి, శంకర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న చాడ కిషన్‌రెడ్డి

తగిసిన ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి

చిట్యాలరూరల్: అకాలవర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి అరూరి శ్రీను డిమాండ్ చేశారు. మండలంలోని వెలిమినేడులో వర్షానికి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పరిశీలించి మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి నిబంధనలు పెట్టకుండా కొనుగోలు చేసి మద్దతు ధరను కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిచో రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నెలికంటి నర్సింహ, పంది నరేష్, సుర్కంటి బుచ్చిరెడ్డి, దేశబోయిన నర్సింహ, నల్ల బుచ్చిరెడ్డి, ఎంపల్ల లచ్చిరెడ్డి, సుర్కంటి పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే: సీపీఎం

చండూరు, మునుగోడు, కేతేపల్లి, నార్కట్‌పల్లి, ఏప్రిల్ 22: దేశంలో, రాష్ట్రంలో పేద ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ సోమవారం నాయకులు చండూరు, మునుగోడు, కేతేపల్లి, నార్కట్‌పల్లి మండలాల్లో నిర్వహించిన ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. చట్టసభల్లో వామపక్ష పార్టీలు చెందిన అభ్యర్థులు లేకపోతే రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడుతుందన్నారు. పదేళ్లుగా దేశాన్ని పాలించిన బీజేపీ ప్రభుత్వం, ప్రజాసమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ, కార్మిక హక్కులను కాలరాస్తున్న బీజేపీని చిత్తుగా ఓడించాలని అన్నారు. ప్రజాసమస్యలపై పోరాడే తమ పార్టీ అభ్యర్థి జహంగీర్‌ను మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం ఎంపీ అభ్యర్థి జహంగీర్ మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గం వెనకబాటుకు గత పాలకులే కారణమన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

● కేంద్రంలో బీజేపీ గెలిస్తే దేశంలో పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టం రద్దవుతుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. కమ్యూనిస్టుల పోరాటాలతోనే దేశంలో యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చిందని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, ప్రభావతి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహ, డీవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, నాయకులు సలీం, పద్మ, వెంకన్న, వెంకటేశం, ధనంజయ, లింగయ్య, పార్టీ మండల కార్యదర్శి భరత్‌కుమార్, ముత్యాలు, శ్రీను, లింగస్వామి పాల్గొన్నారు.



మునుగోడులో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

● కేంద్రంలో బీజేపీ గెలిస్తే దేశంలో పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టం రద్దవుతుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం గ్రామంలో ప్రచారం నిర్వహించారు.

● కేతేపల్లి మండలంలోని చీకటిగూడెంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ చట్టం రద్దు కాకుండా ఉండాలంటే జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.చినవెంకులు, లూర్దుమారయ్య, కె.లింగయ్య, పద్మ, యాదగిరి, సాలమ్మ పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లిలో నిర్వహించిన సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. మూడు నెలలుగా బకాయిలు ఉన్న కూలీ డబ్బులను వెంటనే చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీ రామోజు వెంకటేశ్వర్లు, చెర్కు పెద్దులు, బయ్యన్న, ఐలయ్య పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డిని కలిసిన చొక్కారావు

నల్లగొండటౌన్, ఏప్రిల్ 22: నల్లగొండ పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి గా పోటీ చేస్తున్న శానంపూడి సైదిరెడ్డిని డ్వాబ్ కార్యదర్శి పొనుగోటి చొక్కారావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. బీజే పీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. నరేంద్రమోదీని మూడోసారి ప్రధానిని చేయాలని చొక్కారావు ప్రజలను కోరారు. ఆయన వెంట పెండ్యాల దామోదర్‌రావు ఉన్నారు.



బీజేపీ అభ్యర్థికి శుభాకాంక్షలు తెలుపుతున్న చొక్కారావు

బీజేపీలో చేరిన మాజీ ఎంపీటీసీ

చిట్యాలరూరల్, ఏప్రిల్ 22: మండలంలోని చిన్నకాపర్తి మాజీ ఎంపీటీసీ ఆకుల వెంకన్న బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు పొట్టపల్లి నర్సింహగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం వెంకన్న బీజేపీ చేరారు. ఆయనతో పాటు పార్టీలో చేరిన వారికి మాజీ ఎంపీ, భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ ఆ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. ప్రజా సంక్షేమం కోసం పని చేస్తున్న ప్రధానమంత్రిగా నరేంద్రమోదీని మూడోసారి అధికారం చేపట్టి హ్యాట్రిక్ సాధించి చరిత్ర సృష్టించనున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పొలిమెర రామ్‌కుమార్, బయ్య రవి, కొండ సాయి, చొల్లేటి బ్రహ్మచారి, ఈరమల్ల భిక్షపతి, యాదయ్య, బాలరాజు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నర్సయ్యగౌడ్

రంగుమారిన తాగునీరు

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 22: పట్టణంలోని పలు కాలనీలకు సరఫరా అయ్యే తాగునీరు రంగు మారింది. పసుపు రంగులో నీరు రావడంతో బంగారుగడ్డ తదితర కాలనీల ప్రజలు ఆందోళన చెందారు. పెద్దదేవులపల్లి రిజర్వాయర్‌తో పాటు మిషన్ భగీరథ ప్లాంట్ల నుంచి పట్టణానికి తాగునీటి సరఫరా జరుగుతుంది. ఈ విషయమై కమిషనర్ యూసుఫ్ మాట్లాడుతూ పైప్‌లైన్లలో తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా నీటి రంగు మారిందన్నారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయిస్తు న్నామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



రంగు మారిన సాగర్ నీరు

సంక్షిప్త సమాచారం...

నార్కట్‌పల్లి: మండలంలోని అక్కెనపల్లిలో ఆదివారం రాత్రి వీచిన భారీ ఈదురుగాలులకు చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడ్డాయి. గ్రామస్థులు విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇచ్చి సరఫరా నిలిపివేయించారు. కరెంటు తీగలపై పడిన చెట్ల కొమ్మలను గ్రామస్థులు తొలగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సహకరించారు. నార్కట్‌పల్లి ఆవాస గ్రామమైన చౌటబావి గ్రామ శివారులో గల తాటిచెట్లపై పిడుగుపడింది.

నార్కట్‌పల్లి: మండలంలోని అక్కెనపల్లి గ్రామానికి చెందిన పలువురు వివిధ పార్టీల కార్యకర్తలు బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కట్టంగూరు: పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి ఎంపీ బీజేపీ అభ్యర్థిగా బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ మండలంలోని కురుమర్తి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోలి ప్రభాకర్, వెంకటేశ్వర్లు, భాస్కర్, హరిబాబు పాల్గొన్నారు.

కట్టంగూరు: పశుసంవర్ధక శాఖలో విధులు నిర్వహిస్తున్న గోపాల మిత్రలకు మూడు నెలల వేతనాలు విడదల చేయడంపై ఆ సంఘం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు శ్రీనివాస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పశు వైద్యశాలలో ఖాళీగా ఉన్న అటెండర్ పోస్టుల్లో సీనియర్ అర్హత కలిగిన గోపాలమిత్రలను వెటర్నరీ సహాయకులుగా అవకాశం కల్పించాలని ఆయన కోరారు.

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని డాక్టర్స్‌కాలనీలో ఈ నెల 24వ తేదీన అన్నపూర్ణ నేత్రాలయం ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ఆళ్ల రామశేషయ్య తెలిపారు.

చిట్యాల: దేశంలో సుస్థిర అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్రమోదీకి అండగా నిలవాలని బీజేపీ నాయకులు కోరారు. చిట్యాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పల్లె వెంకన్న, కన్నెబోయిన మహలింగం, శ్రీను, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామంలో గంగదేవమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అందంగా అలంకరించిన బోనం కుండలతో గంగమ్మతల్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలను సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే గంగమ్మతల్లికి భక్తులు గొర్రె, మేక పొట్టేళ్లను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. యువకులు భేరీ చప్పుళ్లతో సంప్రదాయ నృత్యాలు చేశారు.

గట్టుప్పల్: మండలంలోని తేరట్‌పల్లి గ్రామంలో ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయుడు, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదావత్ లచ్చిరాం మొక్కలను నాటారు. ప్రతీ ఒక్కరూ భూతాపాన్ని తగ్గించడానికి విరివిరిగా మొక్కలు నాటాలని, భూ కాలుష్యం కాకుండా చూసుకోవాలని అన్నారు.

దేవరకొండ: దేవరకొండ పట్టణానికి చెందిన పద్మశాలీ సంఘం నాయకుడు పంచాక్షరి మృతి బాధకరమని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం అనారోగ్యంతో మృతి చెందిన పంచాక్షరి మృతదేహానికి వారు వేర్వేరుగా నివాళులర్పించారు. అనంతరం మండలంలోని జిల్లేపల్లి గ్రామానికి చెందిన పరశురాంరెడ్డి మృతికి మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

మిర్యాలగూడ టౌన్: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా క్రీడాధికారి ఇక్బాల్ మహ్మద్ అన్నారు. జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ చాటి పతకాలు సాధించిన పట్టణ క్రీడాకారులను ఆయన అభినందించారు. క్రీడాకారులు ఉత్తమ ప్రతిభతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆదర్శనీయమన్నారు.

మునుగోడు: బీఆర్ఎస్ పార్టీలో పదవులు అనుభవించిన నేతలు పార్టీ మారడాన్ని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అయితగోని లాల్‌దూర్ గౌడ్ తీవ్రంగా ఖండించారు.

గుర్రంపోడు: సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించినందుకు మండలంలోని బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన కట్టెబోయిన వెంకటేశ్వర్లు యాదవ్‌కు అవార్డు అందజేశారు. ఆదిగురు భారత్ సంఘం ఆధ్వర్యంలో భద్రాచలంలో జరిగిన రైతు సమ్మేళనంలో ఘనంగా సన్మానించారు.

బండారు ప్రసాద్‌కు మాతృవియోగం

నల్లగొండ, ఏప్రిల్ 22: నల్లగొండ మునిసిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్ తల్లి వెంకటమ్మ (80) సోమవారం సాయంత్రం మృతి చెందారు. ఆమె కొంతకాలంగా శ్వాసకోశ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె మృతదేహానికి కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్‌తో పలువురు నాయకులు పరామర్శించి నివాళులర్పించారు. ఇదిలా ఉండగా వెంకటమ్మ చిన్న కుమారుడు అమెరికాలో ఉండటంతో అంత్యక్రియలు గురువారం జరిగే అ వకాశం ఉందని కుటుంబసభ్యులు పేర్కొన్నారు.



వెంకటమ్మ (ఫైల్)

'కేసీఆర్, జగదీష్‌రెడ్డిలపై ఆరోపణలు తగవు'

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 22: మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డిలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి బ్రదర్స్ అసత్య ఆరోపణలు చేయడం తగదని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున అన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థిగా కంచర్ల కృష్ణారెడ్డి నామినేషన్ కార్యక్రమానికి యువత అధిక సం ఖ్యలో తరలి రావాలని కోరారు. సమావేశంలో నాయకులు చామకూరి లింగస్వామి గౌడ్, కొమ్ము కోటేష్, మెండు విశాల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొమ్మరబోయిన నాగార్జున

విద్యుత్ అంతరాయం

దామరచర్ల, ఏప్రిల్ 22: మండలంలోని నూనావత్‌తండా సబ్‌స్టేషన్‌లో ఈ నెల 23న విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతులను నిర్వహించనున్నట్లు సోమవారం విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని నూనావత్‌తండా, కేశవాపురం, రాళ్లవాగుతండా, కొండ్రపోల్ గ్రామాల పరిధిలోని ఫీడర్ల కింద ఉన్న గ్రామాలకు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వారు పేర్కొన్నారు.